రహదారిపై చెట్లను తొలగించిన మాజీ వైస్ ఎంపీపీ

కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటో కార్మికులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 6 : రహదారిపై మూలమలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి సొంత ఖర్చులతో తొలగించడంతో ఆటో కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై ఆదివారం ఆటో యూనియన్ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. తాటికొండ నుంచి స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చే రహదారిలో మూలమలుపులు వద్ద చెట్లు పెరగడంతో వాహనదారులకు అడ్డుగా ఉండి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై మాజీ వైస్ ఎంపీపీ దృష్టికి ఆటో కార్మికులు తీసుకెళ్లగా సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో వాటిని తొలిగించారు. దీంతో సుధీర్ రెడ్డికి ఆటో కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎండీ సాజిద్, అధ్యక్షుడు మారపాక కుమార్, ఉపాధ్యక్షుడు బిట్ల నరేశ్, కార్యదర్శి మారపాక స్వామి, సభ్యులు మారపాక శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, ఎండీ ఎజాస్, బాణాల రాజు, పండుగ శ్రీనివాస్, ఎన్ రామాంజనేయులు, రామచంద్రు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

తరిగొప్పుల, అక్టోబర్ 6: ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇస్తున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన జొన్నగోని సృజన వెన్నుముక వ్యాధితో బాధపడుతుండగా స్థానికులు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వివరించారు. దీంతో సృజనకు మెరుగైన వైద్యం చేయించేందుకు రూ.5 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన పత్రాలను సృజన కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు ఉదయ్‌గౌడ్, అర్జుల సుధాకర్‌రెడ్డి, చిలువేరు సంపత్, నర్సింహులు, భూస అంజయ్య, దామెర థామస్ ,తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, వెట్టి సాదయ్య, యాకూబ్, బైకాని బాలరాజు,సుంకరి ఐలయ్య,ప్రవీణ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ పెద్దగా మధుసూదన్ ఎన్నిక

నర్మెట, అక్టోబర్ 6 : ముదిరాజ్ సంఘం మండల కుల పెద్దగా పులి మధుసూదన్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మూడు దశాబ్దాలుగా కుల పెద్దగా ఉన్న రామస్వామి సంఘానికి సమయం కేటాయించకపోవడంతో ఆయన స్థానంలో మధుసూదన్‌ను ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని ఆయన వివరించారు.

రుణాలను సకాలంలో వసూలు చేయాలి

వీవోఏను సన్మానిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్

బచ్చన్నపేట, అక్టోబర్ 6 : మహిళా సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీజీవీబీ మేనేజర్ గురుప్రీత్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని బ్రాంచిలో ఆలీంపూర్‌కు చెందిన తులసి గ్రామైక్య సంఘం నుంచి వందశాతం రుణాలు వసూలు చేసినందుకు వీవోఏ ఎలికట్టె కవిత, కన్నెబోయినగూడేనికి చెందిన వీవోఏ నాగభూషణంను శనివారం ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ గురుప్రీత్‌సింగ్, ఫీల్డ్ ఆఫీసర్ అనూష ఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవో పరిధిలో వందశాతం రుణాలు రికవరీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నాగేశ్వర్‌రావు, నర్మెట ఏపీఎం రవి, సీసీ సత్యనారాయణ, కుమార్, నర్సింహులు, విజయలక్ష్మి, తిరుమల పాల్గొన్నారు.

'గోపా' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన కుర్రెముల యాదగిరి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని నీరా కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో జరిగిన నూతన కార్యవర్గంలో యాదగిరి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యాదగిరిని గౌడ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, కన్న పరశురాములు, రాజుబోసు, పెద్ది వెంకటనారాయణ గౌడ్, నాగరాజుతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

HOUSE FOR SALE

★ కాకతీయ యూనివర్సిటీ దగ్గర్లో, Reliance Smart Pointకి సమీపంలో నెలకు 25K Rents వచ్చే North East Facingలో గల G+1 ఇల్లు (221 Sq.yds) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 8639002604.
NTW-000

BUSINESS OFFER

★ Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి

- స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక తథ్యం
- మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

లింగాలఘనపురం; అక్టోబర్ 6 : బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహం, అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరినందున స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని నెల్లుట్లలో బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తాటికొండ రాజయ్య మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలను కడియం శ్రీహరి తన స్వార్థ రాజకీయాల కోసం మోసం చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సముచిత గౌరవమిచ్చి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతోపాటు ఆయన కూతురుకు ఎంపీ టికెట్ కూడా కేటాయించారని గుర్తు చేశారు. ఉదయం కేసీఆర్‌తో ఆశీర్వాదం తీసుకుని సాయంత్రానికే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకెళ్లిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌కు అమ్ముడుపోయారని ఎద్దేవా చేశారు. కారు గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరినందున త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికలకు కార్యకర్తలంతా సమాయత్తం కావాలని, కడియం శ్రీహరిని చిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాలని రాజయ్య పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే పునాదులని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. అనంతరం లింగాలఘనపురంలో బీఆర్‌ఎస్ నాయకుడు బింగి స్వామి తల్లి జానమ్మ మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. మరో వైపు కట్టర్ రమేశ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేవెల్లి సంపత్, నాయకులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, ఉడుగుల భాగ్యలక్ష్మి, గువ్వల రవి, రవీందర్‌రెడ్డి, గండి యాదగిరి, లింగాల సింధు, చౌదరపెల్లి శేఖర్, గాదెపాక విష్ణు, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు.

ఆరుతరాలకు చెందిన కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు

ఆరుతరాలతో 'బోడకుంటి' కుటుంబ సభ్యుల అపూర్వ సమ్మేళనం

బచ్చన్నపేట, అక్టోబర్ 6 : శాసనమండలి మాజీ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు వంశానికి చెందిన ఆరు తరాల బలగం ఆదివారం మండల కేంద్రంలో కలుసుకుంది. స్థానిక శ్రీనిధి గార్డెన్స్‌లో నిర్వహించిన అపూర్వ కలయికతో సందడి నెలకొంది. మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, రిటైర్డు టీచర్ బోడకుంటి మల్లయ్య, మంచాల భూమయ్య, ఆగయ్య, సిద్దయ్య, అబ్బయ్య, మల్లయ్య, రామయ్య కుటుంబ సభ్యులు, కుమారులు, కోడల్లు, మనవళ్లు, మనవరాళ్లు, ముని మనుమలతో కలిపి సుమారు 300 మంది వేడుకకు హాజరయ్యారు. ఈ ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరూ ఏఏ హోదాలో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సమిష్టిగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆటపాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకే వేదికపై తమ కుటుంబ సభ్యులంతా కలువడం పూర్వ జన్మ సుకృతమన్నారు. ఎవరికెంత ఆస్తులున్నా కుటుంబం అంతా కలిసి ఉంటే ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. రాబోయే తరాలకు మనమంతా ఒక సందేశాన్నిచ్చిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో బోడకుంటి రాములు, బోడకుంటి మల్లయ్య, బోడకుంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

సొసైటీ భూమిని పరిరక్షించాలి

చిల్పూరు, అక్టోబర్ 6 : మండలంలోని శ్రీపతిపల్లి సొసైటీకి చెందిన భూమిని పరిరక్షించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ రంగు హరీశ్ సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయితీ రికార్డు ప్రకారం సొసైటీకి 30 గంటల భూమి ఉండగా 20 గుంటల భూమికి మాత్రమే ప్రహరీ ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. భూమిని పరిరక్షించకుంటే ఆందోళన చేపడుతామన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

నర్మెట, అక్టోబర్ 6 : త్వరలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఆర్వీ రామానుజాచారి కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తహసిల్ ఆఫీస్‌లో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఓటు హక్కు కోసం తహసిల్ ఆఫీస్‌తోపాటు మీసేవ కేంద్రంలోనూ దరఖాస్తు చేయొచ్చని సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

లావణ్య

చరణ్

జఫర్‌గఢ్, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు టీ చరణ్ 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి, ఎం లావణ్య 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి సాధించారు. వీరు ఈ నెల 7 నుంచి హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీకాంత్, పీఈటీలు బీ రాజు, ఏ శ్రీనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

డీజే నిర్వాహకుల ఉపాధిని సర్కారు దెబ్బ తీయొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న డీజే నిర్వాహకులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : డీజే సౌండ్ సిస్టం నిర్వాహకులు, కార్మికుల ఉపాధిని దెబ్బతీయొద్దని డీజే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్లో డీజే ఓనర్స్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా నాయకుడు అశోక్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో డీజే నిర్వాహకులు తమ వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు. డీజేలపై ప్రభుత్వం నిషేధం విధిస్తే వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. అవసరమైతే షరతులతో కూడిన అనుమతులివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

డీజేలపై సర్కారు నిషేధాన్ని ఎత్తేయాలి

స్టేషన్ ఘన్‌పూర్ : డీజేలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ డీజే సౌండ్స్ యాజమానులు, కార్మికులు ఆదివారం మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. డీజే కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా సురేశ్ మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి డీజే సౌండ్స్‌ను ఏర్పాటు చేసుకున్నామని, దీంతో వందలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో సర్కారు నిషేధిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన చెందారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి, నిషేధాన్ని ఎత్తేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కేశోజు భీష్మాచారి, లింగమూర్తి, రజాక్, గోరంతల రాజు, వికాస్, నాగరాజు, సాంబ, పవన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

జిల్లా వ్యాప్తంగా అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు

పెంబర్తిలో అమ్మవారిని నోట్లతో అలంకరించిన భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో భక్తుల సహపంక్తి భోజనాలు

బచ్చన్నపేట, అక్టోబర్ 6 : మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గామాత మందిరాల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు లలితాత్రిపురసుందరీగా దర్శనమిచ్చారు. ఆలీంపూర్‌లో రాక్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మందిరం వద్ద కుంకుమ పూజ నిర్వహించారు. అర్చకుడు సంగమేశ్వర్ పూజలు చేశారు. సాల్వాపూర్‌లో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లతాశ్రీతిరుపతి గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో రాక్ యూత్ సభ్యులు గంగరబోయిన నర్సింహులు, దినేశ్, రమేశ్, బాలరాజు, పరమేశ్వర్, రాజు, కర్ణాకర్, మురళీ, శేఖర్, సిద్ధులు, స్వామి, గణేశ్,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

జనగామ రూరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జనగామ మండలం పెంబర్తిలో ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. రూ.10 నుంచి రూ.200 నోట్లతో దండగా కూర్చి అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.పాలకుర్తిలోని గౌడకాలనీ, శాంతినగర్, గుడివాడచౌరస్తా, గ్రామపంచాయతీ ఏరియాలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చండీ హోమం నిర్వహించారు. అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు గంగు రఘుశర్మ, గంగు శ్రావణ్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.


పాలకుర్తిలో నిర్వహించిన చండీ హోమం

పేదల ఆకలి తీరుస్తున్న నవరాత్రి ఉత్సవాలు

స్టేషన్ ఘన్‌పూర్ : దేవీ నవరాత్రి ఉత్సవాలు నిరుపేదల ఆకలి తీరుస్తున్నాయి. ఇటీవల జరిగిన గణేశ్ ఉత్సవాల్లో మండపాల వద్ద నవ రాత్రులు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. నేడు దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇదేరీతిలో అన్నదానాలు చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని శ్రీమాత దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు మూడు కూరలు, మజ్జిగతో సుమారు వెయ్యి మంది భక్తులకు సహపంక్తి భోజనాలు పెడుతున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి తమ ఆకలి తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గడ్డం కృష్ణమూర్తి మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి రోజూ సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

జనగామలో వీధి కుక్కల స్వైర విహారం

భయాందోళనలో ప్రజలు పట్టించుకోని అధికారులు

జనగామలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : జనగామ పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. స్థానిక సంజయ్ నగర్, అంబేద్కర్ నగర్, ధర్మకంచ, గుండ్లగడ్డ, వీవర్స్ కాలనీ, కుర్మవాడతో పాటు పలు ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో అక్కడ నివాసముంటున్న చిన్నారులు, వృద్ధులతో పాటు ఆ మార్గాల్లో వెళ్లే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో వీధి కుక్కల దాడిలో చిన్నారులు, పెద్దలు తీవ్ర గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలు జనావాసాల్లో సంచరించకుండా మరోచోటికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పిచ్చి కుక్కదాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

పాలకుర్తి రూరల్ : పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి తీవ్ర గాయా లైన ఘటన మండలంలోని చెన్నూరులో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బన్నె పాక ఎల్లమ్మ, ఎండాల కార్తీక్ ఆదివారం ఉదయం బయటకు రాగా పిచ్చికుక్క కరిచింది. దీంతో వారు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు దానిని తరిమికొట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. కుక్కల బెడద నెలకొన్నా అధికారులు పట్టించుకో వడంలేదని ఆరోపించారు.

గాయపడిన బాధితులు

యువకుడి అదృశ్యం


వేణు (ఫైల్)

చిల్పూరు, అక్టోబర్ 6 : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నామాల వేణు(21) శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. లింగంపల్లిలో పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వేణు కనిపించకపోవడంతో సోదరుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చిల్పూరు, అక్టోబర్ 6 : మండలంలోని చిన్నపెండ్యాల శివారులోని ఆకేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇల్లందుల హరిబాబుకు చెందిన ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యాజమానులు ప్రభుత్వ అనుమతి ఉంటేనే ఇసుక తరలించాలన్నారు.

ఉత్తరప్రదేశ్ ఆలయ పూజారిపై ఠాణాలో ఫిర్యాదు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ దస్నాదేవీ ఆలయ పూజారి యతి నర్సింగానంద్ మహరాజ్‌పై ఆదివారం జనగామ అర్బన్ పీఎస్‌లో కేసు నమోదైంది. మహ్మద్ ప్రవక్తపై ఇటీవల పూజారి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జామియా మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన పూజారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ–ముస్లింల మధ్య గొడవలు సృష్టించడానికి ఇలాంటి స్వామీజీలు అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. న్యాయవాది జమాల్ షరీఫ్, హమ్‌సాత్ ఫౌండేషన్ అధ్యక్షుడు యాకుబ్ పాషా, రఫీ, మతిన్, రహీమ్ రమీష్, మౌలానా షకీర్ సాబ్, షకీల్, కలీం, షఫీక్, అఫ్జల్, అబ్బాస్, జహంగీర్, పాషా, అప్సర్, యూసఫ్, తాజ్, అక్రమ్, షాకీర్, సలీం పాల్గొన్నారు.

'9న ఎమ్మార్పీఎస్ నిరసన ప్రదర్శన'

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 6 : ఎస్సీ వర్గీకరణ హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని కోరుతూ ఈ నెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి గాదె శ్రీధర్ అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వీలుగా రాష్ట్రాలకు సుప్రీంకోర్టు అధికారాలు ఇచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యా, ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని రవీందర్ కోరారు. నాయకులు మంద శ్రీనివాస్, చాడ ఏలియా, గుర్రం అశోక్, బీఆర్‌ఎస్ మండల నాయకులు మారపాక ప్రశాంత్, ఎడ్ల రవీందర్, దళిత నాయకులు దైద సుమన్, ఐలపాక సామేల్ పాల్గొన్నారు.

ఎస్సై హమీద్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

బచ్చన్నపేట, అక్టోబర్ 6 : ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్‌కే. హమీద్‌ను ఆదివారం మండలంలోని బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు కోనేటి స్వామి, దూడల కనకయ్యగౌడ్, మండల కోఆర్డినేటర్ ఫిరోజ్, నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, ముశిని రాజుగౌడ్, శశిధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆజాం, భాస్కర్‌రెడ్డి, మధుప్రసాద్, వినయ్, శ్రీనివాస్, వినయ్, నర్సిరెడ్డి, రాజనర్సయ్య, ఐలయ్య, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టుషాపులను రద్దు చేయాలి

జనగామ రూరల్, అక్టోబర్ 6 : గ్రామాల్లోని బెల్టుషాపులను వెంటనే రద్దు చేయాలని, ఇందుకు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మరిగడిలో జరిగిన పార్టీ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కనకారెడ్డి మాట్లాడుతూ బెల్టు షాపులతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నందున, దీనికి అలవాటుపడిన వారు ఆర్థికంగా, శారీరకంగా నష్టపోతున్నారని తెలిపారు. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని, యువత పెడదారి పట్టే అవకాశముందన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మామ్ముళ్ల మత్తులో పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను రద్దు చేయాలని కోరారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శులుగా కూరాకుల శ్రీను, దండు శ్రీను, సహాయ కార్యదర్శిగా బాల్నే శ్రీకాంత్, బండి చందర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బోడ నరేందర్, నాయకులు సాంబరాజు యాదగిరి, మీట్యానాయక్, కిష్టయ్య, లక్ష్మయ్య, నారాయణ, సమ్మయ్య, ఆశోక్, మల్లేశ్, పాండు, సిద్ధులు, కిషన్, సంపత్, పవన్ పాల్గొన్నారు.

కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 6 : మండలంలోని శివునిపల్లిలో గోళి రామలింగం మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2011–2013 బ్యాచ్‌కు చెందిన సైన్స్, మ్యాథ్స్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాంబమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గురువుల బోధనతోనే తాము ఈ స్థాయికి చేరుకున్నామన్నారు. కళాశాలలో మౌలిక వసతులకు తమ వంతుగా సహకరించి విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగీరథ్, దివాకర్, శ్రీనాథ్ పటేల్, పూర్వ విద్యార్థులు శివ, రమేశ్, పరిపూర్ణాచారి, మౌనిక, కోమల, రూప, చందులాల్, అనిల్, బాలు, సంతప్, రాజశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండంలోని తిమ్మంపేట ప్రైమరీ స్కూల్‌లో 1998–99లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు దస్తగిరి, నర్సయ్య, భాస్కర్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యుగేందర్, నాగరాజు, మహేశ్, యాకస్వామి, రేవతి, సరస్వతి, స్వరూప, యాదలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

మొన్న తనయుడు, నిన్న తల్లి ..

మూడు రోజుల్లో ఇద్దరి మృతితో విషాదం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 6 : మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన ఆకుల శ్రీనివాస్ అప్పులబాధతో గురువారం ఆత్మహత్య చేసుకోగా, ఆదివారం అతడి తల్లి వెంకటమ్మ (75) గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల వ్యవధిలో తల్లీతనయుడు మృతి చెందడంతో కుటుంబాన్ని విషాదంలో ముంచింది. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకే కుటుంబంలో మూడు రోజుల్లో ఇద్దరు చనిపోయారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న భర్త, అత్త ఇద్దరు చనిపోవడంతో శ్రీనివాస్ భార్య, పిల్లలు విలపిస్తున్నారు.

పదోన్నతి పొందిన రాములుకు సన్మానం

లింగాలఘనపురం, అక్టోబర్ 6 : మండలంలోని జీడికల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేకే రాములుకు జనగామలోని ఉప్పలమ్మ ఆలయ థర్డ్‌గ్రేడ్ ఈవోగా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు ఆదివారం రాములును ఘనంగా సత్కరించి ఆశీర్వచనం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, వరదాచార్యులు సిబ్బంది భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి


పవన్ (ఫైల్)

రఘునాథపల్లి, అక్టోబర్ 6: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లంపల్లిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లికి చెందిన గంగాధరి పవన్ (24) ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని కొత్తపేటలో కొన్నేళ్లుగా ఉంటున్నాడు. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల మల్లంపల్లిలో బంధువు మృతి చెందడంతో దశదినకర్మలో పాల్గొనేందుకు ఆదివారం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు సమీపంలోని చెరువులోకి దిగి నీళ్లలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు పవన్ కోసం నీటిలో వెతకగా అరగంట అనంతరం మృతదేహమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ యాదవ్ తెలిపారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి

బచ్చన్నపేట, అక్టోబర్ 6 : బీఆర్‌ఎస్ బలోపేతానికి నిరంతరం తనవంతు కృషి చేస్తానని పార్టీ మండల కోఆర్డినేటర్ ఫిరోజ్ అన్నారు. కోఆర్డినేటర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు గంగం సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఫిరోజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సలహాలు, సూచనలతో పార్టీని గ్రామగ్రామాన విస్తరింప చేస్తామన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అవకాశవాదంతో పార్టీలు మారే వారికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దూడల కనకయ్య గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, రాజనర్సు, ఐలయ్య, ఆజాం, శ్రీనివాస్, ఆశోక్, మధుప్రసాద్, వినయ్, ముశిని రాజుగౌడ్, నూకల నర్సిరెడ్డి, కోనేటి స్వామి, గుర్రాల నర్సిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.